# పంచకల్యాణి

## శ్రీ ధనిష్ఠ

అతని కళ్లముందు దొక మెరుపు మెరిసింది—

కళ్లు జిగేల్ మన్నాయ్.

గుండె ఝల్లుమంది.

తన కళ్లు చెదరలేదుగదా !

నులుముకుని మళ్లీ చూశాడు—

రంభా, పూర్వశా, తిలోత్తమా, ఘృతాచా, ఏకవీరా, అరుణా, కల్పనా ?—లేక యిదంతా తన కల్పనా ?

అచేతనంగా ఉండిపోయిన అజంతా శిల్పాన్ని చూసి జాలి వేసిన బ్రహ్మ జీవం పోశాడా ?

ఆ కళ్లు !

అవి కలువలా ! కమలాలా !

ఆ రూపాన్ని వర్ణించడం రాని తన భాషెందుకు ?

తానొక శిల్పిగా గాని, చిత్రకారుడుగా గాని ఎందుకు పుట్ట లేదు ?

నవ్వులో అంత అందం ఉంటుందా ?

వెన్నెలలు కళ్లలోకి కొట్టిన ట్టనిపిస్తోందే !

అదేమిటి అంతా మసకై పోతోంది ?

కేవలం యిది తన భ్రమేనేమో ! కాదు కన్నీరు దృష్టిని అడ్డగిస్తోంది.

ధభేల్—

మత్తు విడిపోయిందా శబ్దంతో—

నూతిలో చాద పడిపోయింది—అతని చేతికి పట్టు తప్పిన కారణంగా—

కిలకిలా నవ్వు వినిపించింది. చిరునవ్వు ఒక మెట్టు గడిచి ఆమె నోరార నవ్వుతోంది, అతని అవస్థ చూసి.

సిగ్గుపడిపోయిన అతను స్నానానికి అంతటితో స్వస్తి చెప్పి గబగబ రూంలోకి వచ్చిపడ్డాడు.

నూనె రాసుకుని, దువ్వుకుందుకు అద్దం దగ్గర కెళ్లాడు—అదేమిటి !! ఆ నూతి నీళ్ల మహత్యానికి తనకి స్త్రీ రూపు సిద్ధించలేదుగదా ! తన ముఖం యిల్లా మారి పోయిం దేమిటి ?

అతని మనఃఫలకంమీదనించి ఆమె రూపింకా చెరిగి పోకపోవడం మూలాన అద్దంలో అతని ముఖం ఆమెలాగే గోచరించింది.

సాధారణంగా మన రెటీనామీద పడ్డ చిత్రం సెకనులో పదహారోవంతు కాలం నిలుస్తుంది. ఆలోపున మ రేచిత్రం పడ్డా తెలీదు. దీన్నే పెర్సిస్టెన్స్ ఆఫ్ విజన్ అంటారు. ఈ బలహీనతని ఆధారంగా చేసుకునే సినిమావాళ్లు లక్షలార్జి స్తున్నారు. —యీ క్షణంలో అతని విషయంలో ఆ పరిమితి పదహారోవంతు సెకండుకు బదులు—పది నిమిషాలుగా పరిణితి చెందింది గాబోలు !

సూర్యుడికేసి ఒక్క క్షణం చూస్తే ఏ వస్తువుకేసి చూసినా కొన్ని క్షణాలపాటు ఎర్రటి రంగే కనబడుతుంది.

అల్లాగే ఆ గదిలోని వస్తువు లన్నిటిమీదా ఆమె బింబమే గోచరిస్తూం దతనికి.

"కళ్లు మూసినగాని—కళ్లు తెరచినగాని మళ్లి రూపే" కనిపించింది నాగరాజుకి.

అతనికి ఆమె వదనమే అగుపిస్తూంది.

టంగ్—టంగ్—టంగ్—తొమ్మిది.

కాలేజి గుర్తుకువచ్చి మనసు చివుక్కుమంది.

చేదుమాత్ర మింగినా—విషం తాగినా యింకాస్త నయంగా ఉండేదేమో.

చదువుకునే రోజులలో అయితే హాయిగా ఎగగొట్టి ఉండేవాడు. బట్టలు చాకలాడు తేవడం ఆలస్యమైతే ఎన్ని రోజులు మానలేదు ? సెకండ్ షో సినిమా చూసొచ్చి బద్ధకంకొద్దీ పడుకుని తొమ్మిదైనా లేవక కాలేజీ ఎగగొట్టిన రోజులు !

ఉద్యోగంలో ప్రవేశించగానే ఎన్ని అడ్డంకులు—ఛీ!

అప్పుడే కాజువల్ లీవంతా అయిపోయింది.

తొమ్మిదైపోయిం దప్పుడే—ఇంకా దార్లో అయ్యరు గారి మృదుహస్తాలమీదుగా భోజనం ఆరగించాలి. అది ముగిసి పదింటికి కాలేజీలో ఉండాలి.

అత్యంత ప్రయత్నంతో ఆమె రూపాన్ని తుడిచేసి మేకప్ కానిచ్చి బయలుదేరాడు.

ఫస్ట్ అవర్ క్లాసుంది. అవుళ్లనుకుంటూ వెళ్లే సరికి సెకండ్ బెల్ కూడా అయిపోయి పది నిముషా లయి పోయింది. అయిదు నిమిషాలు ఆలస్యంగా వస్తే స్టూడెంట్స్‌ని నానా చీవాట్లు పెట్టి ఎంట్రీ యివ్వని అతనికి చచ్చే సిగ్గే సింది. డిసిప్లిన్ డిసిప్లిన్ అని తెగ మొత్తుకునే తనే ఆచ రణలో శూన్యంచేసి వారి ననడం !

క్లాస్‌లో పాఠంచెప్తూ నావెల్టీకి బ్యూటీ పర్యాయ పదంగా చెప్పి అరగంట దానిమీదే లెక్చరిచ్చేశాడు—పాఠం వది లేసి—కుర్రాళ్లకి మతిపోయింది. కాదు మేష్టారుకి మతి పోలేదుగదా అని మతిపోయుంటుంది.

సాయంత్రం అయిదు గంటల కింటికి చేరుకున్నాడు. కాళ్ళ చేతులు ముఖం కడుక్కుందుకు పెరటిలో కెడదామనుకుని—ఆమె దర్శనభాగ్యం కలుగుతుందేమోననే ఆశతో—అంతలోనే పిరికితనం, సిగ్గు, భయం కలిగి పక్క వసారా అరుగుమీదే ఆ కార్యక్రమం ముగించాడు.

ఈ వూరు కొత్తగా వచ్చిన కారణంగా పరిచయాలాట్టే లేకపోవడం, తోడులేకుండా ఎక్కడికీ వెళ్లలేని బలహీనతా తోడ్పై వీధిలోకి కదిలే అవకాశానికి స్వస్తి చెప్పగా నచ్చిన నవల తీసుకొని యీజీచైరులో కూర్చుని అందులో మునిగిపోతూంటే—

"మీపే రేమిటన్నారూ ?" తియ్యని రొజచేస్తూ గులక రాళ్లమీదనించి సెలయేరు గలగలా పారినట్టూ, వెయ్యి వీణ లొక్కసారి మ్రోగినట్టూ, మామిడిచిగుళ్ళు తెగమెక్కి వసంతాన్నాహ్వానించే లక్ష కోయిల లొక్కసారి కులికినట్టూ వినిపించింది—

ఆ కంఠస్వరానికి ఉలిక్కిపడి పులకించిన హృదయంతో తల పైకెత్తేసరికి గుమ్మంలో—

అప్పుడే దివి నుంచి భువికి దిగిన అప్సరలా—

జన్మజన్మాల అతని తపస్సుకు మెచ్చి వరమివ్వడానికి దయచేసిన దేవతలా—

నిరుపేదకు పెన్నిధిలా—

దరహాసవదనంతో ఆమె !

ఎవరి ముఖం చూడడానికి ఎంతో ఉత్కంఠపడి పిరికితనంతో మిన్నకున్నాడో, ఎవరి రూపు తన హృదయంమీద ముద్ర వేసుకుందో—

ఆమే !

పొద్దుటిలాగే అతని గుండెలు దడదడ లాడాయి. ఆమెను చూడడాని కెంత ఉత్సుకత పొందిందో అతని మనస్సు అంతలోనే వణికింది—భయపడింది. భయాందోళనానంద మిశ్రమమైన ఆ అనుభూతిని నీచోపమానం అని సందేహించకుంటే దురదపెట్టిన చోట వేడి చూపించితే కలిగే దానితో పోల్చవచ్చును.

"అదేమి టలా గుడ్లు మిటకరిస్తారు ? పొద్దున్నా అంతే." ఎన్ని జన్మల అనుభవం ప్రసాదించిన నేర్పో ఆ నవ్వులో ధ్వనించింది !

ఆమె అందాన్ని కళ్లతోనే తాగుతూ మదిరాపానం చేసిన మైకంలో కొట్టుకుంటున్న అతని కీ మాటలతో కించిత్తు జాగ్రత్త కలిగింది. కాని అప్పటికీ నోరు తెరవలేకపోయాడు.

"పేరేమిటి మహాత్మా అంటే అలా తెల్లబోతా రేమిటండీ ?" తెల్లబోవడం ఆమె వంతైంది—తల వంచుకోవడం అతని వంతూను.

సంబాళించుకుని, సంస్కారాన్ని నలుగురిలో మసిలిన అనుభవాన్నీ ఒక్కసారిగా కూడతీసుకుని,

"ఏమీ అనలేదు" అన్నాడు ఆమె మొదటి ప్రశ్నకు సమాధానంగా—ముఖం పైకెత్తి.

అసలే తెల్లనైన ఆమె ముఖం మరింత తెల్లబోగా అయోమయంగా చూసింది అతనికేసి.

నవ్వడం అతని పాలపడింది.

చిరుకోపంతో చురుక్కున చూసింది సూదులతో పొడుస్తూ అతనికేసి.

"అదే—నాపేరు ఫలానా అని చెప్పలేదని నేను అంటున్నాను" అన్నాడు.

అప్పటికి అర్థమై—"భలేవారే—" పెదాలు యిరువైపులకీ సాగి కపోలాలమీద సొట్టలు పడగా, విడివడిన పెదవుల మధ్యనుంచి మెరిసే పలువరసని ప్రదర్శిస్తూ హాయిగా నవ్వింది.

"రవి—" అన్నాడు పేరు బయట పెడుతూ.

"చక్కగా ఉంది." అన్న ఆమె ముఖంలో ఏ భావం కనబడిందో అతనికి అర్థంకాలేదు.

"థాంక్స్—మరి మీపేరు ?"

"నాపేరా ?—నాపేరు మీ కెందుకూ ?" సీరియస్‌గా ముఖంపెట్టి అంది.

"నాపేరు మీ కెందుకో అందుకే—" అన్నాడు. ఆమె తిక్కకు తిక్కగానే సమాధానం చెప్పాలనిపించి—

"వోహో గట్టివారేనే—" కనుబొమలు ఎగరేసి కళ్లు గుండ్రన చేసి అని—మళ్లీ మామూలుగా మార్చి—"మాయ" అంది.

అంతలోనే "మీ దగ్గర ఏవైనా పుస్తకాలున్నాయా ? చదువుకుందుకు ?" అంది మళ్లీ ఆమె.

"ఎటువంటివి కావాలి ?" తనదగ్గరేవో లక్ష పుస్తకాలున్నట్టు అన్నాడు—కాని అతని అసలు యిచ్ఛ ఆమెతో సంభాషణ పొడిగించడమే.

"ఏవైనా ఇంగ్లీషు నవలలుంటే—"

"ఆమాట విన్న అతనికి కాస్త మతిభ్రమణం కలిగిన మాట వాస్తవం.

"మీ రెంతవరకు చదువుకున్నారు?" అడిగాడు తేరుకుని.

"బియ్యే పాసయ్యాను." అంది.

"ఆఁ!" అన్న అతని నోరు తెరిచినట్టే ఉండిపోయింది కొన్ని క్షణాలు.

"మీకు మతి యిట్టేట్టే పోతూంటుంది కాబోలేం—" తెరలుగా నవ్వు వచ్చేసిం దామెకు.

పక్కలు నెప్పిపెట్టేలా నవ్వుతూ నిలబడలేక టేబిల్ నానుకునే టప్పటికి అతనికి గుర్తుకొచ్చింది ఆమె అంతసేపూ నిలబడే ఉందని—

సభ్యత వీపుమీద ఒక్క చరుపు చరవగా—"సారీ యింతసేపూ నిలబడే ఉన్నారు—కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు.

"కూర్చోడాని కేముందిలెండి. పుస్తకాలిస్తే నేను వెళ్లిపోతాను." అంది కూర్చుంటూనే—

పుస్తకాలు తెచ్చే నెపంతో కుర్చీలోంచి లేచి షెల్ఫ్ దగ్గర కెళ్లాడు. వెంటనే యిచ్చేస్తే వెళ్లిపోతుందేమో ననే ఆత్రతా—ఎక్కువ ఆలసిస్తే అసభ్యంగా ఉంటుందేమోననే భయం—

పుస్తకాలు సవరిస్తున్నాడే గాని అప్రయత్నంగా అతని తల వెనక్కు తిరగ్గా కళ్లు ఆమెను పరిశీలిస్తున్నాయి.

పొద్దున్న అనుకోకుండా అప్రతిభుడు కావడంతో ఆమెను పరిశీలించనే లేదు. ఇంతసేపూ సిగ్గుతో ఆమెను చూడనైనా (సరిగ్గా) లేకపోయాడు.

పోతపోసిన బంగారుబొమ్మే—పొంగే యవ్వనంతో కొట్టొచ్చే అవయువ సౌష్ఠవం. పునః పునః దర్శించగోరే మహా సౌందర్యవతి ఆమె.

ఆమె టేబిల్‌మీద ఏదో పత్రిక తిరగవేస్తూ గబుక్కున తల పైకెత్తగానే రవి తల తిప్పుకున్నాడు.

పుస్తకాలిస్తే వెళ్లిపోతుందని తెలిసీ, తప్పక అయిష్టంగానే రెండు పుస్తకాలు తీసుకుని "ఇవిగో తీసుకోండి—" అంటూ టేబిల్‌మీద పెట్టాడు.

తీసుకుని ఆమె కుర్చీలోంచి లేచి వెళ్లిపోబోతూంటే—

"మీరు—"

"ఈ యింటివా రమ్మాయిని—" ప్రశ్న పూర్తి కాకుండానే—

"మరి—"

వూరినించి నిన్ననే వచ్చాను—వస్తా — థాంక్స్ —" అంటూ అతని నిస్పృహకి అతన్ని వదిలేసి ఎలా తుఫాన్‌లా వచ్చిందో అల్లాగే వెళ్లిపోయింది.

బైట వెలుగుతగ్గి నిశాదేవి రాకని సూచిస్తూంది—ఆమెతోబాటు తన గదిలో అంతసేపూ దివ్యకాంతు లీనిన జ్యోతి చటుక్కున ఆరిపోయిందా అన్నట్టు గదంతా ఒక్కసారి చీకటి కమ్మింది—ఆ సహజకాంతి లోపాన్ని కృత్రిమ కాంతితో పూరించడం యిష్టంలేక ఆ సంజె చీకటిలోనే కూర్చున్నాడు.

అతని వూహలు పరుగిడ నారంభించాయి.

అంత అందానికి తగ్గ తెలివిని ప్రసాదించాడు భగవంతుడు. తన ప్రశ్నల సారాంశం మధ్యలోనే గ్రహించి జవాబులిచ్చేసింది. బి. ఏ పాసైందిట !—కాని బి. య్యే పాసైన అందరిలోను యింత నాన్ ఛాలెంసీ, పుష్, ఉన్నాయా ? ఎంత గొప్ప శిక్షణ పొందింది ?

విద్యార్థిదశ అంతా కో ఎడ్యుకేషన్ సాగిన తన జీవితంలో ఎంతోమంది అమ్మాయిలతో పరిచయం, సాన్నిహిత్యం, స్నేహం ఉన్నా, ఎవరూ తన్నింతగా కదిలించలేకపోయారు. మత్తెక్కించలేకపోయారు. పిచ్చెత్తించలేకపోయారు. ఇదంతా ఈమెలోని ప్రత్యేకతా—తనలోని మనోవికారమా ?

తొలిచూపులోని వలపును గురించి విని పకపక నవ్వే తనకి ఆమె రూపమే వెన్నెల అయి, ఆమె మంజీరధ్వనే మృదంగ నిస్వనం అయి కూర్చున్నాయి.

తనలో యింతటి బలహీనత దాగిఉందా ?—పైకి ఎంత ఆడంబరంగా ఉన్నా అందరినీ యింత చిన్న విషయాలు ఎంతగానో వివశం చెయ్యగలవా ?

వెలయాళ్ల వలలో చిక్కుకున్న విజ్ఞుల చర్యల కీ బలహీనతే కారణమా—

ఒక క్రమంలేని అతని ఆలోచనలు సుడుల్లా తిరిగిపోతున్నాయి.

*          *          *          *

ఒకరోజు కాలేజీనుంచి తిరిగివస్తూ బజారులోకి వెళ్లాడు రవి పర్‌చేజెస్ చెయ్యడానికి.

ఫాన్సీషాప్‌లో హేరాయిల్, సోప్ .... వగైరాల కొంటూండగా వీపుమీద మద్దెలమోత మోగడంతో యీ వూళ్లో తనకింత పరిచయస్థు లెవరా అని ఆశ్చర్యంగా వెనక్కి తిరిగేసరికి—

"ఇక్కడ ఎప్పుడు స్థాపించావురా ఆశ్రమం ?" అంటూ అతని ఫ్రెండ్ రాజు కనిపించాడు.

ఎంత విస్మయంలో మునిగిపోయాడో అంత సంతోషంలోను తేలికోపోయాడు రవి—

రాజు తనూ ఇంటర్మీడియేట్ వరకూ కలిసి చదువుకున్నారు. ఎంతో ప్రాణస్నేహంగా ఉండేవారు. తరువాత వాడింజనీరింగ్‌కీ తాను ఆనర్స్‌కీ వెళ్లిపోవడంతో విడిపోయారు. అది జరిగి ఎనిమిదేళ్లయింది. మొదట్లో రోజుకో ఉత్తరం రాసుకునేవారు. తరువాత అది వారానికోటీ, నెలకోటీ, అర్థసంవత్సరాని కోటీ అయిపోయి ఆ తరువాత కేవలం గ్రీటింగ్స్ పంపుకోవడంలోకి దిగిపోయి, అలా అలా మబ్బుల్లో కలిసిపోయింది మూడేళ్లనించి—చదువైపోయి ఉద్యోగంలో ప్రవేశించాడనే తెలుసు తనకి—ఎక్క డుంటున్నాడో మాత్రం తెలీదు. ఇలా కలవడం వూహాతీతం కావడంతో వాడు కనబడగానే తెల్లబోయాడు తను.

వాడికీ అదే జరిగిఉండాలి—కాని వాడు మొదట తన్ను గుర్తించడం జరగడంవల్ల యీపాటికి తేరుకుని ఉంటాడు—

"ఏరా తెల్లబోతావ్ ?—అంత మర్చిపోయావుట్రా ? వోరి నీ—" దండకం మొదలుపెట్టాడు రాజు.

"అది కాదురా నువ్వివాళ యిక్కడ సాక్షాత్కరిస్తావని కలకంటానా నేను ? It is really a pleasent surprise."

నువ్విక్కడికి వేంచెయ్యబోతున్నావని ఓ ఉత్తరం ముక్కైనా రాసి పారెయ్యకపోయావుట్రా—" ఉత్తరంముక్కరాయడం వరకు తెలిస్తే అసలు రవి యింత ఆశ్చర్యపడనక్కర ఉండేదికాదని రాజుకి ఆ క్షణంలో తట్టలేదు—పరాయి వూరినించి వచ్చిన ఎవర్నయినా "ఓ ఉత్తరం రాసి పడేస్తే రెక్కలు కట్టుకుని స్టేషన్‌లో వాలి ఉండనా—" అని అడిగే

సెయ్యడం Secoud nature అయిపోతుంది కొందరికి —అదొక్కొక్క సందర్భంలో ఎంత అసందర్భంగా ఉంటుందో మర్చిపోతారు.

"నువ్విక్కడ తగులడ్డావని నాకేం తెలుసూ—" రవి సమాధానం యిచ్చాడు.

ఈ వరసన సాగిపోయింది సంభాషణ—

అక్కడినించి యిద్దరికీ పరిచయం ఉన్న పాత నేస్తుల జాబితా అంతా వల్లించుకుని ఒకళ్లకి తెలిసినవీ, మరొకరికి తెలియనివీ అయిన వివరాలు ఏకరువు పెట్టుకున్నారు.

అలా గంట పేవ్‌మెంట్ మీదే గడిచిపోయింది.

"అయితే ఇంతకీ నీ వొక యింటివాడ వయినట్టా లేదా?'

"అబ్బే అదింకా వూహల్లోనే ఉందిగాని నీమాటేమిటి?

"మనకో జూనియర్ గూడానోయ్—"

"Is it !—అచ్ఛా Congrats Buddie—"

"Thanks—ఇంక పద."

"ఎక్కడికీ—"

"ఈ పేవ్‌మెంట్‌మీద ఎంతసేపని ఏడుస్తాం ? కాళ్లు గుదులు కడుతున్నాయి—ఇంటికి పద—యిల్లాల్నీ సుపుత్రుణ్ణీ పరిచయం చేస్తాను."

"ఇప్పుడు కాదురా—తరవాత వస్తాను."

"వోరు ముయ్యరా idiot —బెట్టు చేస్తున్నాడు—వెధవ— నా దగ్గిర !—పదపద—ఏయ్ గాడీ—

గాడీలో వెడుతూ పెళ్లి విషయాన్ని ఏకరువుపెట్టాడు రాజు—

పద్మ బి.యస్.సి.బి.యిడి – ఆవూళ్లోనే స్కూల్లో మిస్ట్రెస్‌గా పనిచేస్తోంది.

ఇంటికి చేరేవేళకి పిల్లాణ్ణి ఆడిస్తూ రాజుకోసం కని పెట్టుకునిఉంది పద్మ—

వీరిని చూసి లోపలకు దారి తీసింది.

"పద్మా వీడు—రవి అని నేను చెప్తూంటాను !" పరిచయం చేశాడు.

పద్మ నమస్కారం చేస్తూ "మిమ్మల్ని గురించి ఎప్పుడూ చెప్తూంటారు. " అంది పద్మ కలుపుగోలుతనంగా—

"అవునండి—యింటర్ అయేవరకు ఒక్క నీడని మసిలేవాళ్లం యిద్దరం—" రవి అన్నాడు—

"ఒరేయ్ అబ్బీ, మావఁరా—మావఁ" అంటూ పిల్లాణ్ణి పద్మ దగ్గిర్నించి తీసుకుని రవికి అందిచ్చాడు రాజు.

చిరునవ్వు లొలకబోస్తూ బొద్దుగా, చక్కగా ఉన్నాడు కుర్రాడు—రవి జేబులోని పెన్ అతణ్ణాకర్షించింది గాబోలు దాన్ని బయటకు లాగే ప్రయత్నంలో పడ్డాడు—

"అరే ! వాడికీ తెలిసినట్టుందే చుట్టరికం—ఎవరి దగ్గర కెళ్లమన్నా ఏడుస్తాడు" అంది పద్మ—

"మరి మావఁ కాదుటే—దగ్గర కెళ్లకపోతే పిల్ల నెలా యిస్తాడు—యిప్పటినించే మంచి చేసుకొంటున్నాడు—ఎంతైనా వాడు నీ కొడుక్కాదూ—" తన హాస్యానికి తానే నవ్వుకున్నాడు రాజు.

"అయితే మనవాడికి పెళ్లాం సిద్ధంగా ఉందన్నమాట."

"అబ్బే అప్పుడే కాదు. కాని ఫ్యూచర్‌లో—వీ డింకా ఉత్త బాచులర్—"

పద్మ నవ్వింది—

రవికి వాళ్ల దాంపత్యం చూసేసరికి ఎంతో ఆనంద మయింది.

కొందరి కొందరి ఫ్రెండ్స్ యింటికి వెడితే తలుపు తియ్యకుండానే లేరని తరిమేసే యిల్లాళ్లున్నారు. పెళ్లి చేసుకుంటే యింక స్వాతంత్ర్యానికి స్వస్తే నేమోరా దేవుడా, అని భయం వేసేది రవికి—స్నేహితులు రాగానే తలుపులు బిడాయించెయ్యడమో, వీధిలోకి ఉడాయించెయ్యడమో చెయ్యాలి గాబోలిల్లాంటి యిల్లాళ్లు వస్తే అనిపించేది— దానికి వ్యతిరేకంగా అనవసరపు భేషజాలు, సంకోచాలు లేకుండా ప్రవర్తించిన పద్మ పట్ల గౌరవం ఉదయించింది రవికి.

చదువూ సంస్కారం కలిగి ఉద్యోగం చేస్తున్న ఆమెలోని సౌమ్యత, స్నేహశీలత్వం తల్చుకునేసరికి మాయ గుర్తుకొచ్చిం దతనికి.

ఆ దివ్యసుందర విగ్రహం—ఆ సంగీతం ఒలికించే కిన్నెర కంఠం, వాటికి మెరుగులుపెట్టే విద్యాసంస్కృతులు, శిక్షణ —ఆమెను తల్చుకుంటే తనకి కవిత్వం పుట్టుకొస్తుంది—మత్తెక్కుతోంది. శరీరం వివశం అవుతోంది.

భోజనాలు కానిచ్చి మళ్లీ కబుర్లలో పడ్డారు.

రాత్రి పన్నెండు అయినట్టే తెలియలేదు—

టైం చూసుకుని హఠాత్తుగా లేచాడు రవి.

"అబ్బా—అప్పుడే పన్నెండు—ఇంక వెడతానురా."

నీ మొహం యిప్పు డెక్కడి కెడతావ్ ! పొద్దున్నే పోదుగాన్లే—అడగడం మర్చిపోయాను. అస లింతకీ తమరి మకాం ఎక్కడ ?"

"గాంధీనగర్‌లో—"

"గాందీనగర్‌లో—"

"మూడో క్రాస్ స్ట్రీట్—"

" ఊ—"

"—వారిల్లు"

" Is it ?"

"ఏం నీకు తెలుసా !?" ఆశ్చర్యం సంతోషం ముప్పిరిగొనగా అడిగాడు రవి—రాజుగాణ్ణడిగి అంతా తెలుసుకోవచ్చు—

"తెలుసా ఏమిటి ?—పార్వతమ్మగారు—అంటే మీ హౌసోనర్ శంకరంగారి మిసెస్ మాకు డిస్టెంట్ ఆంట్—అయినా చాలా క్లోజ్ గా ఉంటాం—యీమధ్య కాంపుల హడావిడిలో అటొచ్చి నెలయింది. అదీకాక అదో కోస్తా యిదో కోస్తా—"

"అయితే మాయ నీకు కజిన్ సిస్టరన్నమాట!"

"మాయా ?"

"అదే నా రమ్మాయి."

"దానిపేరు శారద—మాయని చెప్పిందా—చెప్పే ఉంటుంది" నిట్టూర్చాడు రాజు.

"ఏమిటీ—అయితే ఆమె పేరు మాయ కాదూ—"

"కాదు—మానవ జీవితం విచిత్రం కదూ రవీ—రచయితవి నీకు చెప్పడం ఏమిటి కాని—అసలు పరిపూర్ణమైన జీవితా లంటూ మానవులకి ఉండవేమో—ఏదో ఒక లోపం ఉండితీరుతుంది. ఒక్కొక్కప్పుడు అదెంత చిన్న లోపమైనా, తాత్కాలికమైనదే అయినా ఒక్కొక్క జీవితాన్నే ఎండమావిని చేసేస్తుంది—"

మాయ పేరు మాయ కాదు శారద అని చెప్పగానే ఆమె అలా చెప్పడానికి కారణం తెలుసుకోవాలనే ఉత్కంఠతోను, ఆ సస్పెన్స్ భరించలేకనూ రవి ఉంటే యీ వేదాంత పాఠంమీద విసుగు జనించి—సభ్యత కూడా మర్చిపోయి

"నీ వేదాంతం ఆపి అసలు విషయం చెప్పవోయ్—" అనేశాడు.

"మా శారద బంగారు బొమ్మా—అఖండమైన తెలివి గలదీ—ఆ ఒక్క లోపమే లేకపోతే—"

"లోపమా—"

"అవును. ఆమెకు మతి భ్రమించింది. పేరడిగితే అప్పటికి తట్టిన పేరు చెప్పేస్తుంది. తీవ్రతరమైన పిచ్చి కాదు. ఒకర్ని బాధించేదీ, కేకలు వేసి హంగామాచేసే తత్వం గల ఉన్మాదం కాదు. ఉన్నట్టుండి ఒక్కొక్కసారి వస్తుంది. తనలో తనే మాట్లాడుకుంటుంది. ఒక్కత్తీ ఉంటుంది. అబద్ధాలు అతి సులువుగాను, నమ్మించేట్టుగాను, వృథాగా ఆడేస్తుంది—అన లామెను చూస్తే పిచ్చిదని ఎవ్వరూ అనుకోలేరు—తెలిస్తే తప్ప—"

ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు.

రవికి మిన్ను విరిగి మీద పడింది—ఒక్కసారి కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎవరో తలమీద ఒక్క పెట్టు పెట్టినట్టయింది.

మాయ పిచ్చిదా ! దేవుడికి బుద్ధిలేదు.

అంత అనంతసౌందర్యరాశికి మతి పోగొట్టాడా—యీ ప్రపంచపు ఉనికిమీదే అపనమ్మకం కలిగిం దతనికి.

"రవీ—రవీ—" రాజు కుదిపితే యీ లోకపు పరిధిలోకి వచ్చాడు.

"ఏమిటలా కొయ్యబారి పోతున్నావ్ ?—" ఆత్రంగా ప్రశ్నించాడు రాజు మళ్లీ.

అరికట్టలేకపోయిన అంతటి బలహీనతకి తానే సిగ్గుపడి—ప్రయత్నంమీద తన్నదుపులోకి తెచ్చుకుని—

"ఏంలేదురా—ఒక్కసారిగా ఆమాట వినేసరికి భరించలేకపోయాను—"

"నీ హృదయం మరీ సున్నితంరా—అట్టే పరిచయంలేని నీకే అంత బాధ వేసిందే—ఇంకా తల్లిదండ్రుల కెల్లా ఉంటుందో ఆలోచించు."

"అసలు అల్లా ఎందుకు జరిగింది ?"

"స్కూల్‌ఫైనల్ స్కూల్లో ఫస్టుగా పాసైంది—పై చదువు చదువుదా మనుకుంది. మా పిన్ని కొంచెం చాదస్తురాలు. చదువు ఆపించి పెళ్లి ప్రయత్నాలు చేశారు. ఒక మంచి సంబంధం స్థిరపడింది. పెళ్లి వారం ఉందనగా కలరా వచ్చి ఆ పెళ్లికొడుకు చచ్చిపోయాడు. పెళ్లి అవనందుకు అంతా సంతోషించాం. కాని యిదొక పాడు వాడుకయి చప్పున సంబంధాలు రాలేదు. దాంతో శారదకి విరక్తి కలిగింది. పుస్తకాలు చదువుతూ ఒంటరిగా నిర్లిప్తంగా ఉండడానికి అలవాటు పడిపోయింది. చివర కది పిచ్చిగా పరిణమించింది."

"మరి డాక్టర్లకు చూపించలా ?"

"చూపించారు—మందు లిప్పించారు—వాళ్ళ తేల్చింది పెళ్లి చేసెయ్యమని. పిచ్చి కుదిరితేగాని పెళ్లికాదు. పెళ్లయితే గాని పిచ్చి కుదరదు. అదీ పరిస్థితి. మా బాబయ్యగారికి ఒకర్ని మభ్యపెట్టి పెళ్లి చేసెయ్యడం యిష్టం ఉండదు."

"ఇంకతన్న ఘోరం ప్రపంచంలో ఉండదు—" అంటుంటే రవి కంఠం రుద్ధం కావడం కేవలం సానుభూతి దయార్ద్రతలవలనే అనుకున్నాడు రాజు.

రాత్రి నిద్రపట్టలేదు రవికి.

మర్నాడు రూంకి తిరిగి వచ్చాడే కాని మనసు మనసులో లేదు.

కాలేజీకి వెళ్ల బుద్ధికాలేదు. సెలవు పంపించేసి మంచంమీద పరుండిపోయాడు.

శారద పిచ్చిది !!!!

ఆ వూహ అతన్నెంత కదిలించిందంటే తనకే పిచ్చెక్కుతుందేమో ననిపించింది. అలా జరిగినా బాగున్ననిపించింది. యీ భరించలేని ఆవేదనకంటె అదే నయం ! అనుకున్నాడు.

పిచ్చి అంటే—

తెగని వూహలతో కొట్టుకొంటూ వాటినుంచి తప్పుకోలేక వాక్కుద్వారా బయటపెట్టే స్థితి. తీరని కోరికలతోనో చెప్పుకోలేని ఆవేదనలతోనో సతమత మవుతున్న బాధని భరించలేక కొట్టుకుంటూ మనస్సునీ చేష్టలనీ అదుపులోకి తెచ్చుకోలేని బలహీనస్థితి—జాగ్రదవస్థలో ఉద్రేకాలను కోరికలను అదుపులో ఉంచి మనస్సులో ఏటువంటి ఆలోచనల చేసినా అవి బైటపడకుండా కాసుకుంటాం—మనస్సు స్వాధీనం తప్పిన మనిషిని ఉన్మాది అంటారు. అణిగి మణిగి ఉన్న మానవుల కోరికలు మామూలువారిలో నిద్రలో బయటపడితే—మేలుకుని ఉండగానే బయటపడతాయి పిచ్చివారికి.

వారి ప్రపంచం వారిది—వారిలో వారే మాట్లాడుకుంటుంటారు. వారి కోరికలు తీరినట్టే ఫీలయి అల్లాగే ప్రవ

ర్తిస్తూంటారు. రాజ్యాలు చేస్తారు, మంత్రులయిపోతారు, కవులు, గాయకులు—ఏది కావాలనుకుంటే అదే సిద్ధించినట్టు ప్రవర్తిస్తారు.

ఇతరుల వూహలతో, విమర్శలతో వారికి సంబంధం ఉండదు. ఈ సమాజపు కృత్రిమ సభ్యతలకి వారు లోబడరు. వారికళ్ల కేవేవో దృశ్యాలు కనబడతాయి. ఏవో మాటల వినిపిస్తాయి. ఆనందిస్తారు, రోదిస్తారు, కోపగిస్తారు, విపరీత ప్రవర్తనులైపోతారు.

లోపల ఏదో ఆలోచిస్తూ పైకి మరోలా ప్రవర్తిస్తూ నటిస్తూండే జాగ్రదవస్థ కంటే ఉన్మాదావస్థే బహుశః నిర్మలమైనదీ, నిష్కల్మషమైనదీనేమో—

ఈవిధంగా పరుగెడుతున్నది రవి మనసు—

ఇంతలో—

"రవిగారు—రవిగారు" పిలుపు వినబడింది. కిన్నెర కంఠం. నాయుడుగారు అంత చక్కని స్వరాన్ని వాయులీనం మీద వినిపించగలరా—అంటే రవి 'యింపాసిబుల్' అనేస్తాడు—శారద దాకంఠం—కాదు మాయదీ—ఆమె కా మాయపేరే బాగుంది రవికి.

తలపులకు స్వస్తిచెప్పి వాస్తవంలోకి అడుగిడి తలుపు తెరిచాడు రవి. లోపలకు వచ్చింది.

"ఇవాళ కాలేజీ కెళ్లలేదేం ?—సెలవా ?" గబగబ వీణా తంత్రులమీద వివిధ స్వరాలు పలికించింది.

తలంటిపోసుకుంది కాబోలు-తుమ్మెదరెక్కల్నీ, మేఘాల్నీ ధిక్కరించే ఆమె నూనె రాయని కురులు ముఖానికో వింత శోభ కూరుస్తున్నాయి. పసుపు పులుముకున్న ఆమె పచ్చని ముఖం వెలిగిపోతోంది. గిల్లితే రక్తం చిమ్మినట్టుంది విశాలమైన ఆమె నుదుటి తిలకం. ఆ కర్ణాంత విశాలాలయిన ఆమె నయనాలు నీలి కాంతులు వెదజల్లుతున్నాయి—అంత అందమైన ఆమె ముక్కు ఖరీదు కోటి రూపాయలుంటుందంటే 'వాళ్లకి బుద్ధిలేదు. వస్తుమూల్యం కట్టడానికి వాళ్లనర్హులు' అనెయ్యగలడు రవి. లిప్‌స్టిక్ అక్కర్లేకుండానే తాంబూల చర్వణం చెయ్యకుండానే కెంపు రంగుతో ప్రకాశించే ఆమె పెదవులు, తెల్లబోయి నోరు తెరిస్తే విడిపోయిన పెదవుల మధ్య మెరిసే పేర్చిన ముత్యాలు—కొనదేరిన చుబుకం—కుడిపక్కకి బ్యూటీస్పాట్—శంఖంలాంటి మెడ—ఆమె కట్టుకున్న చీర శరీరాన్ని ఆచ్ఛాదితం చెయ్యగలుగుతోందేగాని ఆ వంపుల్ని దాచలేకపోతూంది.

ఆమెను చూస్తే రవి మనస్సు నిలవలేదు.

"నన్ను చూసినప్పుడల్లా అల్లా గుడ్లు మిటకరిస్తారేమిటండీ—" కొరడా చురుక్కుమంది.

"సెలవు పెట్టాను." అన్నాడామె మొదటి ప్రశ్నకి సమాధానంగా.

"ఏం ?"

"వూరికనే—"

"ఇంకేం పుస్తకాలు లేవూ—"

"మొన్న మళ్లీ యిచ్చినది చదివేశారా ?"

"ఆఁ!"

ఆమె చదివిందన్న నమ్మకం అతనికి లేకపోయింది—

"—పుస్తకంలో హెన్నా కేరెక్టర్ ఎల్లా ఉంది ?"

"అద్భుతంగా ఉంది—" అంటూ ఆ పాత్రని గురించి విపులీకరించింది.

మరో రెండు పుస్తకాలిచ్చి ఆమెను సాగనంపాడు.

ఈమెకు పిచ్చేమిటీ ?—

కాని రాజుకు అబద్ధం ఆడవలసిన అవసరం ఏముందీ—

ఆ ట్రాన్స్‌లో పడనంతవరకు ఆమె మామూలు మనిషే నన్నమాట! కాకపోతే ప్రవర్తన కొంచెం విపరీతంగా ఉంటుంది.

ఆమె సౌందర్యం తన్ను దహించేస్తోంది—ఆమె సన్నిధిలో తన మనసు స్వాధీనం తప్పుతోంది—ఆమెను పొందాలనే ఆకాంక్ష తనని వెర్రివాణ్ణి చేస్తోంది—ఏదో తపన, బాధ, వర్ణనాతీతమయినవి తన్ను పీడిస్తున్నాయి—వీటినించి తప్పుకోవడం తన సాధ్యంకాదు—ఒక్కటేమార్గం కనబడుతోంది— ఆమెను పెళ్ళి చేసుకోడం!

కాని ఆమె ఉన్మాదిని—అయితే వ్యాధి అన్నది నివారణ కాకపోదు—

యౌవనంలోవచ్చే యిటువంటి ఉన్మాదాన్ని సంసార సౌఖ్యం నివారిస్తుందని డాక్టర్లు చెప్పగా తాను విన్నాడు—

ఈ అంతులేని విరహం భరించేకంటే ఆమె తన గృహిణిగా ఉంటూ ఉన్మాదిని అయినా ఫరవాలేదు—పెళ్ళిచేసుకున్న తరువాత భార్య ఉన్మాదిని అయితే చేసేదేమిటి ! ఆమెలేని తనకు ప్రపంచం శూన్యం—బ్రతుకు వృధా—

ఎవరేమనుకున్నా, ప్రపంచమంతా తన వెర్రి వ్యామోహాన్ని గర్హించినా జీవితమంతా దీనికోసం సర్వనాశనమయినా ఆమె తనకు కావాలి—

పూర్వా పరాలాలోచించేస్థితికి అతనప్పుడు అతీతుడు—అతని మనస్సు నామె ఆవరించింది—అతనికి ఒక్కటే లక్ష్యం—అది ఆమె సాహచర్యం—దానికోసం అతను తన సర్వస్వాన్నీ త్యాగం చేసేంతగా తయారయ్యాడు—

సాయంకాలం రాజు యింటికి వెళ్లాడు.

రాజింకారాలేదు—పద్మ సాదరంగా ఆహ్వానించి అతిథి సత్కారం చేసింది—

ఆమె అడిగే ప్రశ్నలకు అప్పటికి తోచిన సమాధానాలు చెప్తూ, సంభాషణ సాగిస్తున్నాడేగాని రాజురాకమీదే లగ్నం అయి ఉంది అతని మనస్సంతా—

ఒక శతాబ్దం అనిపించిన అరగంటకి రాజు వచ్చాడు—

"హల్లో డియర్—ఎంతసేపైంది వచ్చి?—"నవ్వుతూ గ్రీట్‌చేసి రవి పక్కనే కుర్చీలో ఆశీనుడయ్యాడు.—

"అప్పుడే అరగంట అయింది — కాని మీరింత ఆలస్యం చేశారేం?" పద్మ అడిగింది.

"దార్లో ఎవరో కనబడితే వాడితో మాట్లాడుతూంటే ఆలస్యమైపోయింది." అని పద్మకి సమాధానంచెప్పి "అల్లాఉన్నా వేమిట్రా జ్వరంగాని వచ్చేందేమిటి?" అన్నాడు రవితో—

"జ్వరం ఏమీలేదుగాని—నీతో ఒక విషయం మాట్లాడాలి"—

"మాట్లాడేయ్"

"అల్లా ఎక్కడికైనా పోదాం పద"

"ఆల్ రైట్—సారీ పద్మా—"

"ఫరవాలేదులెండి."

"అరె! మీరేదో ప్రోగ్రాంమీద ఉన్నట్టున్నారే—" రవి అన్నాడు.

"ఆ ఏమంత ప్రోగ్రాంలే—సినిమాకి—ఇవాళ కాకపోతే రేపు" అన్నాడు రాజు.

"మీ రాజుకి నేనో రాహువులా దాపరించినట్టున్నానే!" అన్నాడు రవి పద్మతో ఎపోలజటిక్‌గా—

"ఒరేయ్—ఏమిటి కవిత్వం చెప్పేస్తున్నావ్—అయినా ఎంతచెడ్డా రచయితవికదా!—"

పద్మ మందస్మితం చేసింది.

రవి రాజు బైటకు నడిచారు.

రైలు రోడ్డమ్మట అరమైలునడిచి మంచిచోటు చూసుకుని ఏటవాలుగా ఉన్న గట్టుమీద కూర్చున్నారు.

"ఏమిటోయ్ మాట్లాడాలన్నావ్ ?" రాజు అడిగాడు.

మరే ఉపోద్ఘాతం లేకుండానే—

"నేను శారదని పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు రవి.

ఆ మాటలు రాజుకి అర్థంకాలేదు.

"ఏమిటీ?" అడిగాడు మళ్ళీ

రవి చెప్పాడు.

రాజు ఆశ్చర్యానికంతులేదు. కొన్ని క్షణాలు ఆ విస్మయం నించి తేరుకోలేకపోయాడు—

తరవాత కూడా చప్పున మాట్లాడలేకపోయాడు.

రవి కూడా మౌనమే వహించాడు.

రాజే మౌనాన్ని భంగంచేస్తూ మొదలుపెట్టాడు.

"రవీ! శారదకు పెళ్ళౌతుందంటే నాకంటే సంతోషించేవాడు మరోడుండడు. కాని నువ్వు త్వరపడి ఒక నిర్ణయానికి రావడం నాకిష్టం ఉండదు. శారద కథవిన్న నీకు ఆమెమీద విపరీతమైన సానుభూతికలిగి, నీ హృదయం ద్రవించి నువ్వీ నిశ్చయం చేసుకుంటే యీ పొరపాటుకు నువ్వు తరువాత విచారించవలసి వస్తుంది. ఆమెమీద జాలికొద్దీ నువ్వేదో త్యాగం చేశాననుకుంటే ఫలితాలు విపరీతంగా ఉంటాయి. యీ విషయం నువ్వు ఆలోచించు."

"అన్నీ ఆలోచించాను—నే నామెను ప్రేమించాను" అన్నాడు రవి. అన్నింటికీ ఆ ఒక్క ముక్కే సమాధానం అయినట్టు.

నెలలోగా శారదకూ, రవికీ పెళ్ళయింది—

ఆరాత్రి. పాముకుబుసలాంటి తెల్లని చీర కట్టుకుని పాల సముద్రంనించి ఉద్భవించిన లక్ష్మీదేవిలా— అపర రతీదేవిలా దివ్యజ్యోతులను వెదజల్లుతూ రవి కౌగిలిలో వాలిన శారద పరిష్వంగం అతన్ని స్వర్గవీధులలో విహరింప జేసింది.

శారదను ఆ వూళ్ళోకల్లా పేరుమోసిన వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్ళి చూపించాడు రవి.

వైద్యం మొదలుపెట్టి ఆమె ఆలోచించడానికి తావియ్యకుండా ఎప్పుడూ ఏదో విధంగా ఎంగేజ్ చెయ్యాలని చెప్పాడు డాక్టర్—

వైద్యుడు పాలే కోరాడు. రోగీ పాలే కోరాడు.

ఉధృతమైన వరదమీదఉన్న అతని ప్రేమ వాహిని అనుక్షణమూ ఆమె సాన్నిధ్యమేకోరితే వైద్యుడూ అదే కావాలనడం రవికి తృప్తినిచ్చింది.

కాలేజీ వదిలిందే తడవుగా యింటికొచ్చి వాలిపోయేవాడు—రాజుని కలుసుకుందుకూ, మాట్లాడడానికీ కూడా తీరికే ఉండేది కాదు—

అలా గంటలతరబడి ఆమె ఎదురుగా కూర్చుని ఆమెవంక అలాగే చూస్తుండడం—ఏవో తెగ కబుర్లు చెప్పడం—ఆమెలోని ప్రతీ కదిలిక అతణ్ణి పరవశం చేసేది—ఆమె ఆరాధనలోనే తన తీరిక కాలమంతా గడిపేవాడు.

"అబ్బ! మరీ చంటిపిల్లలైపోతున్నారు. అస్తమానం నా కొంగేపట్టుకు తిరుగుతూంటే చూసేవాళ్ళేమైనా అనుకుంటారనైనాలేదు మనిషికి" నవ్వుతూ కోప్పడేది శారద.

"ఎవరేమనుకున్నా నాకు బాధలేదు శారదా!—నిన్ను విడిచి క్షణం ఉండలేను." ఎంత అమాయకంగా అనేవాడో—అంత హృదయపులోతులనించీ అనేవాడు—

"ఇంకా క్లాసులలో పాఠాలేం చెప్తున్నారుబాబూ—ఇంక మీ స్టూడెంట్స్ పాసైనట్టే—"

"కళ్ళు మూసుకుని గడిపేస్తున్నాను కాలం—ఈ గంటా ఎల్లాగో అల్లా గడిచిపోతే నీ నించి నా ఎడబాటులో ఒకగంట తరిగిపోతుందిగదా అనే ఆశ ఆ గంటా చప్పున గడిచేటట్టు చేస్తుంది"

"అయినా అంతవెర్రి కూడదు మనిషికి" మందలింపుగా అనజూచే శారద అవధులులేని ఆనందార్ణవంలో మునిగిపోతుంది—అతని అవిరళ ప్రేమ గుర్తించి—

అంతులేని యీ అరాధనలో తన ఆలోచనలకి తావులేక శారదకు విరక్తి, నిర్లిప్తత తొలగిపోయాయి—

తదుపరి పరిశీలించిన డాక్టర్‌యింక కొద్ది కాలంలో ఆమె పూర్తిగా కోలుకుంటుందని చెప్పాడు—అదివరలో వారాని కోసారైనా తనలోకంలోకి తానుపోవడం—ఒంటరిగా ఉండడం జరిగేది—నాలుగు నెలలు గడిచినా అటువంటిది జరగలేదు.

మరో రెండు నెల్లకి రవికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది—

అతని గుండెల్లో రాయిపడింది.

ఇక్కడ అత్త మామల సాయం ఉంది తమకు—

అక్కడ శారద వంటరిగా—

ఎవరి సంసారాలు వదులుకొని ఎవరు వస్తారు? ఎంత కాలమని వస్తారు? తా మొక్కరూ ఉండడం ఎల్లాగూ తప్పదు.

డాక్టర్ని కంసల్ట్ చేశాడు—ఇంక ఫరవాలేదన్నాడు డాక్టర్.

రవి రిలీవ్‌అయివెళ్ళి కొత్త వూళ్లో జాయిన్ అయ్యాడు.

రోజు రోజూ శారద దగ్గరనించి ఉత్తరానికై ఆరాటమే. క్షణక్షణం ఆమె స్మరణే—ఆత నామెతో గడిపిన మధుర క్షణాల స్మృతే అతన్ని నిలిపింది—ఆమె ఎడబాటు అతన్ని పిచ్చెత్తించే ట్టుండేది—

వారం రోజులలోనే ఎక్కువ అద్దెకు యిల్లు తీసుకుని శారదను తీసుకురావడానికి సెలవుపెట్టి అత్తారి వూరెళ్లాడు.

మొదటిసారిగా తనతోవచ్చే శారదతో అత్తగారు కూడా వచ్చింది.

నెల రోజులుండి అత్తగారు వెళ్ళిపోయింది.

చంటి కుర్రాడికి వాడడిగిన వస్తువు లభ్యమైతే కలిగే ఆనందమే రవిని అవహించింది—ఎప్పుడూ ఆ వస్తువు విడవ కుండా ఎంతో పదిలంగా చూసుకుంటూ అదెవ్వరికి చూపించడం అన్నా ఎంతో మురిపెం, గర్వం కలిగినట్టే— తన శారదను తనతో తీసుకువెళ్ళడం అంటే ఎంతో గర్వంగా ఉండే దతనికి—

ప్రతిరోజు సాయంవాహ్యాళి, నాలుగు రోజులకో సినిమా—

ప్రతి పనిలోను ఆమెకు సాయపడ ప్రయత్నించడం చీవాట్లు తినడం అతనికి మహదానందాన్నాపాదించేవి.

కేలండర్‌లో ఎన్ని కాగితాలు చిరిగిపోతున్నాయో వారికి తెలిసేదికాదు—

* * *

ఒకరోజున కాలేజీలో ఏదో మీటింగ్‌ఉండి ఒకగంట ఆలస్యంగా వచ్చాడు రవి.

గుమ్మంలో శారద ఎదురు చూస్తూంది.

రవిని చూడగానే బుంగమూతిపెట్టి కోపంగా విసవిస నడుస్తూ, లోపలకు వెళ్ళిపోయింది.

రవి అనుసరించాడు—

"శారదా"

మౌనం—

"శారదా కోపమా !"

అప్పటికీ ఆమె పలకలేదు—

దగ్గరగావెళ్ళి ఆమె భుజాలు పట్టుకుని తన కభిముఖంగా తిప్పుకున్నాడు.—

అభిమానం కోసం ప్రదర్శిస్తున్న దామె ముఖం.

"తప్పలేదు శారదా—ఏదో మీటింగ్‌ఉండిపోయి ఆలస్యం అయింది—అక్కడికీ పూర్తి కాకుండానే తప్పించుకున్నాను."

"అంతా అయింతరువాతే రాలేకపోయారా—పాపం! పొద్దున్న ఏం తెలియనిది హఠాత్తుగా పుట్టుకొచ్చింది కాబోలేం?" ఇంకా ఆమెకోపం తగ్గలేదు.

"నిజం శారదా—నన్ను నమ్మవూ?" ఆమె ముఖాన్ని చేతులలోకి తీసుకుంటూ ఆమె కళ్లలోకి దీనంగా చూశాడు.

"ఛా! ఎందుకు నమ్మనండీ—అయినా ఒకత్తినిగదా నాకేం తోస్తుందీ—మూడున్నరనించి మీకోసం కళ్ళు కాయలు కాస్తూ ఎదురు చూస్తూంటాను.మీరు కూడా ఆలస్యంచేస్తే నాకు ఏమిటో దిగులుగా వుంటుంది. పుస్తకాలు చదవద్దని ఆంక్ష పెట్టారాయె!" సగం నిష్టూరంగానూ, సగం పసితనంగాను అంది.

"నిజమే శారదా—ఇంకెప్పుడైనా ఆలస్యం అతుందని తెలిస్తే ఒక గంటముందేవచ్చి నిన్ను కూడా తీసుకుని వెడుతూం టాను.—అదికాదుగాని శారదా యిన్నాళ్లయిందికదా యిక్కడి కొచ్చి. పక్కింటివాళ్లతో పరిచయం అభివృద్ధి చేసుకుని కాలం గడపడం అలవాటు చేసుకోకూడదూ?"

"అప్పుడింక మీ ఫ్రెండ్సేమిటో, మీ మీటింగ్‌లేమిటో చూసుకుంటూ నన్ను మర్చిపోవచ్చనేగా ?— అప్పుడే మొహం మొత్తిందా ?" చటుక్కున కోపం వచ్చేసిందామెకు.

"కాదు శారదా—అపార్థం చేసుకోకు—ఒక్కత్తినీఉండడం తోచడంలేదంటున్నావని అన్నాను కాని నిన్నొదిలి క్షణం ఉండ గలనా? అటువంటి మాటలని నన్నెందుకు బాధిస్తావు?"

"క్షమించండీ—ఏదో ఉడుకుమోత్తనంకొద్దీ అనేశాను. పోనీ నాకే వూలో ప్లాస్టిక్‌దారాలో తెచ్చిపడెయ్యరాదూ వాటితో ఏదేనా అల్లుకుంటూంటే పొద్దుపోతుందీ?" అంది అంతలోనే నవ్వుతూ.

"నాకా సంగతి తట్టనేలేదుస్మా—బాగా జ్ఞాపకం చేశావు. రేపే కొనిపట్టుకొస్తాను"

మొన్నాడు ఒక పౌను వూలు, రంగు రంగుల ప్లాస్టిక్ దారాలు వాటితోచేయదగిన వివిధ వస్తువులను గురించిన పుస్త కాలుతెచ్చి పడేశాడు—

అవాళ మార్నింగ్ సెషన్ ఇంకా గంట ఉందనగానే యింటికి వచ్చేశాడు రవి తన క్లాస్ అవగానే—

వేసిఉన్న తలుపు తోసుకుని ప్రవేశించాడు.

హాల్లో సోఫాలో కూర్చుని తదేకధ్యానంతో అల్లిక సూదులు పుచ్చుకుని స్వెట్టర్ అల్లుతోంది శారద—

సన్నని పొడుగాటి ఆమె వేళ్లు అతి సుందరంగా నాట్యం చేస్తున్నాయి సూదులమీద, వూలుమీద—

ఎన్నోసార్లు చూసిన శారద చేతివేళ్లలో అంత అందం అప్పుడే పొడగట్టింది రవికి—

చప్పుడు చెయ్యకుండా పిల్లిలా అడుగులో అడుగు వేసు కుంటూ ఆమె వెనక్కువెళ్ళి నిలబడ్డాడు—

ఏకాగ్రతతో అల్లుతున్న ఆమెకు రవి ప్రవేశం తెలియ లేదు.

చిలిపితనంకొద్దీ ఆమె కన్నులు మూశాడు.

ఉలిక్కిపడిలేచి—పట్టు విడిపించుకుని—యిటు తిరిగి,

"మీరా!— ఎంత భయపెట్టే శారండీ—గుండెలు దడదడ లాడిపోయాయి—" ఆమె ముఖం వివర్ణమయిపోయింది.

"అరె! అంత కంగారు పడతావనుకోలేదు శారదా—"రవికే భయం వేసింది ఆమె ముఖం చూస్తే— గబుక్కున ఆమెను చేతులలో చుట్టేసి గాఢంగా గుండెల కదుముకున్నాడు.

ఆ కౌగిలి ఆమె భయాన్ని కొంతవరకు పోగొట్టడంతో తేరుకుని అతనిని విడిపించుకుని—

"అసలు నాకు తెలియకుండా ఎట్లా వచ్చారండీ—"

"రాణిగారిల్లా మై మరచిపోయి పన్లలో మునిగిపోతే నేనే కాదు ఏ దొంగో చక్కగా యిల్లు చక్కబెట్టుకుపోతాడు—అయినా అంత ఏకాగ్రత కూడదు శారదా"

"చాలిద్దురు బాబూ వేళాకోళాలు—"కొంచెం కోపంగా మొహం గంటుపెట్టుకుంది—

ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవడానికి—

"అది సరేగాని స్వెట్టరెంతవరకు వచ్చింది?" అడిగాడు రవి.

"సాయంకాలానికి అయిపోతుంది—చూడండి మీ కొలతలకే వేశాను—బావుందా?"ఉత్సాహంతోను సంతోషంతోను ఒకపని సాధించిన గర్వంతోను వెలిగిపోతున్న ముఖంతో స్వెట్టరుతీసి చూపించింది.

కాఫీరంగు పూలుతో, పెనవేసుకున్న పాముల డిజైన్‌తో ఎంతో అందంగాఉంది స్వెట్టరు. తన శారద చేతుల్తో ఏపని చేస్తే ముచ్చటగా ఉండదూ? అనుకున్నాడు రవి.

"అద్భుతంగావుంది—నీ ఎకౌంటులో ఒక యాభై రూపాయలు వేసుకో—మా రాణిగారి స్వహస్తాలతో అల్లినదానికి మా పారితోషకం అది—"

"అహహా! కర్ణుడి తరవాత మిమ్మల్ని చెప్పుకోవాలి దాతల్లో—ఎక్కౌంటులో వేసుకోవాలిట—ధర్మ ప్రభువులు!—ఎందుకూ ఆ సద్దు నాలిగ్గీసుకోనా?" పకపకనవ్వేసింది.

"అయితే నీ అప్పుతీర్చలేనంత దరిద్రుడననా నీ ఉద్దేశ్యం?

"ఛఛ! అంతమాట నే నెందుకనాలి—మీరింక యిల్లా మాటమీద మాట పెంచకుండావుంటే అదే పదివేలు—కాసేపు ఇవాల్టి పేపరు తిరగేస్తూ కూర్చోండి—ఈలోపున అయ్యగారికి కాఫీ సమర్పించుకుంటాను"

"ఒద్దు శారదా—నాకోసం నువ్వింత కష్టపడి యిది అల్లినందుకు కనీసం యీ పూటకి యీ దీనుడు నీకు కాఫీ కాచి యిస్తాడు."

"మీరు కాస్తారా?—అయితే యింక కాఫీతాగినట్టే—!"

"ఇదుగో అమ్మాయ్—అంత గర్వం కూడదు ఎవరికైనా అసలు ఆడవాళ్లకి వంటేం తెలుసు?— ద్రౌపదీపాకం, దమయంతీపాకం అనడం ఎప్పుడైనా విన్నావా?"

"అబ్బో! అంత ప్రజ్ఞ తమకుంటే నే నింట్లోకి రానప్పుడా హొటల్ గతేమిటి మహాత్మా?"

"అదా అది బద్ధకంవల్ల—పొరపాటు—నా కాలానికి విలువ హెచ్చు. అది వంటచెయ్యడంలో వేస్టు చెయ్యదల్చుకోలేదు నేను—కాని యివాళ నీ శ్రమకి నా కాఫీ ప్రతిఫలంగా యివ్వదల్చాను"

"బాబ్బాబు మీకు పుణ్యం ఉంటుంది. కాఫీ జోలికిమాత్రం రాకండి—బాగా చేస్తానంటూ ఆ పొడంతా దిమ్మరించేస్తారు—పాలు సరిపోక ఉట్టిడికాక్షనే తాగవలసివస్తుంది— ఇవాళసలే సగంపాలు పిల్లిపరం అయ్యాయి—"

"అయితే వో పని చెయ్యి—నువ్వు దగ్గిరుండి చెప్తూండు నేను చేస్తాను."

"మీ పట్టు విడవరన్నమాట—సరే కానివ్వండి. కాని అల్లాగే వంటకూడాచేసిపెడుతూండకూడదూ? నేను చక్కగా అన్నీ దగ్గిరుండి చెప్తాను" కిలకిల నవ్వేసింది.

"ఓహోహోఓహో! పాకం ముదురుతోందే?"

"మీరు తెచ్చుకున్నదేగా?"

స్టౌ వెలిగించి కాఫీ పెట్టాడు—పక్కనే కూర్చుని శారద "అదుగో నీళ్ళు మరిగిపోతున్నాయ్—మీరేదో ఆలోచిస్తున్నారు. ఇల్లాగే కూర్చుని అన్నంవండితే బొగ్గులు మిగుల్తాయి గిన్నెలో" "ఆ కాస్త పొడుం ఏం సరిపోతుంది?" "అమ్మబాబోయ్ అంతే? ఆతల కొట్టెయ్యండి" "పా లన్నీ దిమ్మరించెయ్యకండేం?" "ఇంకోస్పూన్ వెయ్యండి పంచదార లేకపోతే గొంతుక దిగదు" ఇల్లా ఆర్డర్లిస్తూ, సాధిస్తూ వేపించికుతిన్నా ఆ అనుభూతీ ఆనందాన్నే కలిగించింది రవికి.

అన్ని ఆజ్ఞలూ పాలించి ఆ కాఫీ పూర్తిచేసి గ్లాసులలో పోసి నోటిదగ్గర పెట్టుకుంటే పంచదార ముద్ద!

నీవల్లేనంటే మీవల్లే అంటూ దానిమీద పోట్లాడుకున్నా రిద్దరూ.

యీవెనింగ్ సెషన్‌కి టైమవుతూంటే యింక కదిలి "ఇవాళ సాయంత్రం సినిమాకి పోదాం. తయారుగా ఉండు—"

"ఎందుకో అంతదయ—"

"పాపం కష్టపడి నా కో ప్రజంట్ యిస్తున్నావుగా దానికి రెసిప్రొకేషన్ యిది."

"అప్పుడే ముందర కాళ్ళకి బందం వేస్తున్నారు—అదీ తెలీదంటే—యీవంకపెట్టి ఆ యాభై ఎగేద్దామనా?—మేమే అంత తెలివితక్కువవాళ్లం!"

"ఇలా పీడించేస్తున్నావు నువ్వా అమాయికురాలివి!"

"అనండి అనండి—ఎన్నన్నా చెల్లుతుంది మీరు మగ మహ రాజులు!"

"కాదు దేవీ—మీరే ఆడ మహరాణులు. మీ మాట కెదురాడి మేం మనగలమా—నీకు యాభై శాంక్షన్ చేసేశాను. షాపింగ్ రేపు—ఇవాళ సినిమా—ఏం?"

"చిత్తం ఆజ్ఞ" అంది అమాయికంగా ముఖంపెట్టి.

ఆ ముద్దుమొహాన్ని ఒక్కసారి ముద్దుపెట్టుకుని కాలేజీకి బయలు దేరాడు రవి.

సాయంత్రం సినిమాలో—

ఎంతో అనుకూలంగా ఉన్న భార్యాభర్తలు—ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. అయిదేళ్ల అందాలకుమారుడు—కన్నుల

పండుగుగా ఉన్న సంసారం—హఠాత్తుగా ఏక్సిడెంట్‌లో చని పోతాడు భర్త—గుండెలు పగిలే ఆమె దుఃఖానికి "నాన్న ఏడమ్మా" అంటూ ఏడుస్తున్న కొడుకు ప్రశ్న ఎదురుకాగా కొయ్యబారి పోయింది భార్య.

ఎంతో ఉత్కంఠతో ఉంది చిత్రం—

అందులో మునిగి పోయిన రవికి ఎక్కెక్కి ఎవరో ఏడవడం వినిపించి. యిటు తిరిగేసరికి ఆ ఏడుస్తున్నది శారదే కావడం కనిపించింది. అవిరళధారగా స్రవిస్తోంది కన్నీరు. దుఃఖం పట్టలేక ఎక్కిళ్ళు వస్తున్నాయి.

రవికి మతి పోయింది.

వెంటనే ఇంక పిక్చెర్‌మాట దేముడెరుగు యీమె కేమౌతుందో అనిపించి యింటికి తీసుకు వచ్చేశాడు—

శారద కార్రాత్రి ఎంతకూ నిద్ర పట్టలేదు—

సినిమాలో చూసిన సంఘటనలే గుర్తుకు వస్తున్నాయి.

ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఆలుమగల మధ్య ఆ దుస్సంఘటన చిచ్చు పెట్టింది. ఆమెబ్రతుకునీ కొడుకు బ్రతుకునీ నట్టేట ముంచి వారిని అనాథలని చేసింది.

తల్చుకుంటే కన్నీళ్లాగడంలేదు శారదకు.

తరువాత ఏమయ్యారో—ఎన్ని అగచాట్లు పడ్డారో—వారి జీవితా లే కడగండ్లకు గురి అయ్యాయో—చివరకు ఏం జరిగిందో—మధ్యలోనే వచ్చేశా రాయె—

ఆక్సిడెంట్ అంటే ఎంతలో ఉంది!

రవికే అటు వంటిది జరిగితే—

తన గతేమిటి?—

ఛీఛీ తన ఊహలిల్లా పోతున్నాయేమిటి?—ఏమిటీ అప శకునపు టాలోచనలు?

వద్దనుకున్నా ఆ ఊహ లామెను వదలలేదు.

తన అడుగులకు మడుగులొత్తి తనెక్కడ కందిపోతుందో అని భయపడి పోతుంటాడు రవి. తా నతని ఆరాధ్యదైవం—తనని అణువణువునా ఎరిగి ఉన్నా తనలోని ప్రతికదలికా అతన్ని పరవశం చేస్తుంది—అతని ప్రణయ వాహినిలోతేలిపోయే అందాల నౌక తను—

తన లోపం తెలిసి తన్ను పరిణయ మాడాడు—

కంటికి రెప్పలా కాస్తూ తనని తన పిచ్చి ఊహలలో మునిగి పోకుండా చూసుకుంటూ తన కన్నిసౌకర్యాలు జరిగి గిస్తున్నాడు—తనకి చిన్న తలనెప్పి వచ్చినా ఎంతో ఆదుర్దా కనబరుస్తాడు—

ఈ ఆదరణవల్లే, యీ ప్రేమవల్లే తన మనస్సెంతో ప్రశాంతంఅయి నిర్లిప్తత, వంటరితనం, తొలగిపోయి తానెంతో సంతోషంతో హాయిగా మనగలుగు తూంది—తన నోటివెంట ఒక కోరిక రావడం తడవు అది కార్యరూపంధరిస్తుంది—

ఇటువంటి రవి పోతే—ఇంకేమన్నాఉందా—తాను భరించ గలదా?

ఎంత తెంచుకుందా మనుకున్నా తెగటంలే దీ ఊహల సంకెల.

తెల్లవారి లేచిందేకాని ఆమె మనసు మనసులో లేదు. యాంత్రికంగా పనులు చేసుకు పోతోంది—

పేపరు చూస్తున్న రవి పక్క టేబిల్ మీద కాఫీపెట్టి వెను దిరిగింది—

"అదేమిటి శారదా వెళ్లి పోతున్నావ్?నీకాఫీ తెచ్చు కోలేదేం?" దిన చర్యలో మార్పుకి విస్తుపోతూ అడిగాడు—

"అవతల పాలు పొంగిపోతున్నాయ్—మళ్లీవస్తాను." చటుక్కున అబద్ధం చెప్పి లోపలకు వెళ్లి పోయింది—

కాఫీ గబుక్కున నోటిలో పోసుకుని పంచదారలేని కారణంగా అప్రయత్నంగా తుపుక్కున ఉమ్మేసిన రవి—

"శారదా పంచదార వెయ్యలేదు—" అన్నాడు—

సమాధానం లేదు—

శారదా, పంచదార—" మళ్లీ పిలిచాడు.—

"వస్తున్నా—" పంచదారతో వచ్చింది శారద—

కప్పులోవేసి చంచాతో కలిపింది—

అప్పుడు చూశాడు శారదకేసి రవి—

"అదేమిటి శారదా అల్లా ఉన్నావ్?" ఆత్రంగా అడిగాడు—

"ఎల్లాఉన్నాను? ఏంలేదే?"

"కళ్లెర్రగా ఉన్నాయి నిద్రపట్టలేదా?"

"అబ్బే బొగ్గునలుసు కంట్లోపడింది—ఇంకేంలేదు—"

భోజనంలో—కూరలో ఉప్పుమర్చిపోయింది— చారులో చింతపండెక్కువ—

"నీ కొంట్లో బాగులేనట్టుందిశారదా—ఏమిటి నాతో చెప్పవ్ ?" ఆర్ద్రంగా అడిగాడు.

అతని ఆదుర్దా ఆమెను మరింత బాధించింది—

"ఏంలేదు స్వామీ—కొంచెం తలనెప్పిగావుంది—అన్నింటికీ కంగారుపడతారేం?"

"తలనొప్పా—అయితే యింత అమృతాంజనం పట్టిస్తా నుండు—" అంటూ ఆమెవద్దంటున్నకొద్దీ ఆమె నుదుటికి యింత అమృతాంజనం పట్టించి—అప్పటికీ సంతృప్తి చెందక—పోనీ యివాళ్టికి లీవు పెట్టేస్తాను" అన్నాడు—

"బొత్తిగా చంటిపిల్లల్లా మాట్లాడతారండీ మీరు—మనిషై పుట్టింతరవాత ఎవ్వరికీ యింక తలనొప్పి, కడుపు నెప్పీ రావా? చీటికీ మాటికీ యింక లీవుపెట్టి యింట్లో కూర్చో డమేనా ?—వాళ్లాలు ఎవరైనావింటే నవ్విపోతారు—" మంద లించింది.

రవి యింక వాదం పెంచకుండా కాలేజీకి వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం రవి యింటికి వచ్చేసరికి శారద మరింత మూడీగా ఉంది.

రవి ఏదో చెప్పబోతే—"మీరింత ప్రేమ చూపిస్తే భరించలేను—అది నటనేమోననే అనుమానం తెప్పించేంతగా ఉంది మీ ప్రవర్తన—కాస్త నన్నూపిరి పీల్చుకోనివ్వండి స్వేచ్ఛగా—" విసుగ్గా అనేసింది శారద.

రవి మనసులో దిగులు బయలుదేరింది—

అయినా ఏం చెయ్యలేక కాలేజీకి వెళ్ళిపోయాడు.

సాయంకాలం ఆమెకు రిలీఫ్ యిచ్చే ఉద్దేశంతో షాపింగ్‌కి తీసుకువెళ్ళాడు—

బట్టలషాపులో చీరలు చూపిస్తూ, వాటి నాణ్యతనూ, మన్నికనూ తెగ పొగిడేస్తున్నాడు షాపువాడు—

శారద ఒక చీరతీసి అటూ యిటూ చూస్తూండగా హఠాత్తుగా ఒక వెర్రికోరిక కలిగింది ఆచీర గట్టితనం పరీక్షిద్దామని—

చేతులలో తీసుకుని ఒడుపుగా పుటుక్కున చింపేసింది—

షాపువాడి తలా, రవి తలా, ఇంకా అక్కడఉన్న యితరుల తలలూ ఒక్కసారిగా తిరగసాగాయి ఆ సంఘటనకు—

"పిచ్చిగాబోలురా—" అక్కడి పనికుర్రాడు మెల్లిగానే మరోడితో అన్నాడు—

కాని అది ఆ నిశ్శబ్దంలో శారద చెవినిపడింది.

"నాకా మీకా పిచ్చి—యీాయనేమో తెగపొగిడేస్తున్నాడు చీర గట్టితనాన్ని గురించి—ఇలా ముట్టుకుంటే చిరిగిపోయింది—ఛీ! ఏం మనుషులు!" అంది విసురుగా—

రవి కనుసైగచేసి ఆ చీర మూల్యం యిచ్చేసి శారదను బలవంతంగా రెక్కపట్టుకుని బైటకు తీసుకువచ్చి తనతో రిక్షా ఎక్కించేసి— ఆ కుసుమ సన్నిభమైన సౌకుమార్యం కలిగిన ఆమె చేతివేళ్ళల్లోకి అంతబలం ఎల్లావచ్చిందా అని ఆలోచించసాగాడు—

ఇంటికి వచ్చేసరికి శారద కొంత తేరుకుంది—

"ఆ ఊసూాసు చిరిగిన చీరకి డబ్బిచ్చేశారా?" అడిగింది—

రవి మాట్లాడలేదు—ఏమంటే ఆమె మనస్సు ఎటు తిరుగుతుందో అంతుపట్టలేదతనికి—

"చెప్పొద్దూ—ఆ వెధవ ఆ డొక్కుచీరని తెగ పొగిడేస్తూంటే నాకు వళ్ళమండుకొచ్చింది—ఆ గట్టితనమేదో వాడి మొహంమీదే చూపిద్దామని బుద్ధిపుట్టింది—అందుకే చింపేశాను—క్షమించండి—" అంది అపరాధినిలా—

"ఫరవాలేదు శారదా! ఆ దెబ్బతో వాడికి బుద్ధొచ్చింది—నువ్వేం బాధపడకు." అనునయించాడు.

శారద అనుకుంది—అబ్బ ఎంత వోర్పు—ఎంత దయ—రవి నిజంగా దేవుడు—అతని గురుత్వం ఎక్కువ తేటపడుతున్నకొద్దీ ఆమెకు భయం ఎక్కువ కాసాగింది—సినిమాలోసన్నివేశం కళ్లెదుట కనబడడం—అటువంటిదేదేనా రవికి జరిగితే అనే ఆందోళనా—దాన్ని గురించిన విపరీతపు టాలోచనలు—వీటిని త్రెంచుకోలేకపోవడం అధికమైంది.

పిచ్చివారికీ మామూలువారికీ తేడా అదేనేమో—

మామూలు స్థితిలో ఎటువంటి వూహాలువచ్చినా ప్రయత్నంవల్ల వాటినించి తప్పుకోగలం—దానినించి తప్పుకోలేక అదే తేల్చుకుని భయం, వేదనా అధికం చేసుకుని ఇతర వాటిని మర్చిపోవడమే గాబోలు పిచ్చిఅంటే.

రవి మనస్సుకి శాంతిలేకపోయింది.—

తగ్గిపోయిందనుకొన్న శారద పిచ్చి మళ్లీ తిరగబెట్టిందా? అది పిచ్చేనా, లేక నిజంగా పట్టుదలగలిగి అల్లా ప్రవర్తించిందా? మతి చలించకపోతే సభ్యత ఎరిగిన శారద పదిమందిలో అలా చేస్తుందా? ఇది యింకా ముదిరిపోతుందా?

రోజల్లా శారద మూడీగానేవుంది. పరాకుగాను, నిర్లిప్తంగాను, ఉదాసీనంగానేఉంది—తను ఆతృత ప్రకటిస్తే విసుక్కుంటోంది— గత రోజు సాయంత్రం వరకూ ఎంత ఆనందంగా గడిచింది—ఒక్కరాత్రిలో ఇంత మార్పు రావడానికి కారణమేమిటి? ఆ సినీమావా? అందులో ఏముంది? అంత మార్పు రావడానికి-కాస్త సెంటిమెంట్ ఎక్కువపెట్టాడు ప్రజల కంటినీరు తెప్పించడానికి—అది చూసి అంత బేల అయిపోయి మతి పోగొట్టుకుంటుందా— అక్కడికీ తనకి ఆమె ఏడుపుచూసి భయంవేసి ఆట మధ్యలోనే తిరిగి తీసుకువచ్చేశాడు—

ఏం జరగనుందో—తన జీవితానికిదేరాసిఉందా ? ఒక చిన్న సంఘటన షాపులో జరిగినది తనకి తలవంపు తెచ్చింది—అడుగడుగునా ఇటువంటివే తారసిల్లుతాయా—ఇంక శారద ఇలాగే ఉండిపోతుందా — ఏమిటి తన జీవితానికీ పరీక్ష—తను ఏ పాపంచేశాడని భగవంతుడు విధిస్తున్నాడీ శిక్ష?—

రాత్రంతా మేలుకునే ఉన్నాడు రవి— శారదని కనిబెడుతూ—

పొద్దున్నే శారద మామూలుగా పనులు చేస్తూనేఉంది కాని ఆమె మనసుమీదనించి ఆ సినీమా ముద్ర చెరగలేదు. రవికి ఆపదమూడుతుందేమోననే తన ఆలోచనకు అర్థంలేదని తన్ను తాను నమ్మించుకోలేకపోయింది—ఆ అశక్తతకుతోడు విపరీతపు బుద్ధొకటి పుట్టిందామెకు—రవికంటె తానే ముందు చచ్చిపోతే— దాన్ని గురించే ఆలోచించి, ఆ కోరికకే బలం పెంచుకుంది—

పిచ్చివారికి తమ కోర్కెలను చెల్లించుకునే మార్గాన్వేషణలో అసాధారణ ప్రజ్ఞా, తెలివీ కలుగుతాయి—తాను చావడానికి మంచి సులువైనమార్గం—దొడ్లో పెద్ద నూతిలో పడిపోవడం—కాని ఎవరూ ఉండగాకాదు–అందుకు రవిని యింటొంచి తరిమెయ్యాలి.

"తొమ్మిదైనా యింకా కదిలే సూచనలేం లేవేంబాబూ" రవి దగ్గరకెళ్లి అడిగింది—

"ఇవాళ కాలేజీకి సెలవు—"

"ఇవాళేం సెలవు–పండుగకాదు పబ్బంకాదు—కనీసం ఆదివారమైనాకాదు—"

సెలవు పెట్టినట్టు తెలిస్తే మళ్లీ ఏమంటుందోనని భయంవేసి వాళ్ల కాలేజీకి సంబంధించిన ప్రముఖులు ఎవరో స్వర్గాన్నలంకరించడంచేత సెలవిచ్చేశారని బొంకాడు.

శారద తనని దూరం చెయ్యడానికి ప్రయత్నిస్తోందేమోననే అనుమానం వేసింది — ఆ పిచ్చిలో ఏ అఘాయిత్యానికైనా పాల్పడితే — డాక్టర్‌కి కబురుపెట్టాడు.

అనుక్షణం ఆమెను కనిపెట్టజొచ్చాడు—

అది కనిపెట్టిందామె—

"మీ రలా కూడాకూడా తిరిగి కాపలాకాస్తే నాకు పిచ్చెక్కిపోయేట్టుంది—మీరు కాస్సేపు నన్నొంటరిగా వదిలేద్దురుబాబూ మీకు వెయ్యి నమస్కారాలు—" విసుగ్గా అంది శారద.

ఇంత తెలివిగలామెకు పిచ్చేమిటీ అనిపించిందాతనికి.

కాని ఆమె ప్రవర్తనా, మాటలూ విపరీతంగా ఉన్నాయి.

ఒంటరిగా ఆమె నుండ నియ్యడం శ్రేయస్కరంకాదనిపించింది. ఏం చెయ్యడానికీ పాలుపోలేదు—

విధిలేక—ఆమె ఏదోపనిమీద పడగ్గదిలోకి వెళ్ళినప్పుడు బైట గొళ్లెం పెట్టేశాడు—

"ఏమండీ—యిదేమిటి యీ తలుపురావడంలేదు—పైన గొళ్లెం పెట్టేసినట్టుందేమిటి—మీరేపెట్టారా—నేనేం పిచ్చిదాన్ననుకున్నారా తియ్యండి—"

రవి కిక్కురుమనలేదు—

"తలుపు తియ్యరుకదూ?" దబదబ చప్పుడు చేసింది—అప్పటికీ చలించలేదు రవి—

శారదకి ఉక్కురోషం పట్టలేదు—లోపల గోడకి టకటక నుదురు కొట్టేసుకుంటోంది—

రవి మనస్సు చలించిపోయింది—

గబగబ తలుపు తీశాడు—

శారద నుదుట రక్తం కారుతోంది—ఆ దెబ్బల తాకిడికి తల దిమ్మెక్కిపోయి—కళ్ళు వచ్చులు కమ్మినట్టున్నాయి—నేల మీద చతికిలపడిపోయింది—

రవికి కళ్ళనీళ్లు నిండుకొచ్చాయి—దుఖం పెల్లుబికింది ఏడ్చేశాడు.

వెంటనే రక్తం తుడిచి, పౌడర్ అద్ది కట్టుకట్టాడు—

కాస్సేపటికి తేరుకున్న శారద గొణుక్కోవడం మొదలు పెట్టింది.

ఒక అరగంటకు డాక్టర్ వచ్చాడు—

పరిస్థితి వివరించాడు రవి—

సూయిసైడల్ టెండెన్సీస్ కనబడుతున్నట్టు గ్రహించిన డాక్టర్ ఆమెను చాలా జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలన్నాడు—

తన ఉనికే ఆమె భరించలేకపోతున్నదనీ— ఇంక తానెల్లా ఆమెను కనిపెట్టిఉండగలడో తెలియడంలేదనీ వాపోయాడు రవి—

మందేదో ప్రిస్క్రైబ్‌చేసి ప్రస్తుతానికి సెడెటివ్ యిస్తే నిద్రపట్టి తేరుకోవచ్చుని సూచించి ఇంజక్షన్ యిచ్చాడు డాక్టర్—

వెంటనే నిద్రపోయింది శారద—

టెలిగ్రాం అందుకునివచ్చిన పార్వతమ్మగారు, శంకరంగారు కూతురుస్థితిచూసి బావురుమన్నారు—

రోజులు వారాలు గడుస్తున్నాయి—

శారద పరిస్థితిలో మార్పులేదు—

కాకపోతే అవాళ దెబ్బ తగుల్చుకుని తల దిమ్మెరపోవడంతో ఆమె అప్పటికి జరుపుతున్న ఆలోచనలకి బ్రేక్‌పడి ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యలేదు. ఆ తరువాత—

తనలో తాను గొణుక్కోవడం—తనలోకంలో తానుండడం యిదీ వరస—

రవిని ఒక్కొక్కప్పుడు గుర్తించేది—మరొకప్పుడు జన్మలో అతని ముఖం తా నెరగనట్టుండేది—తల్లిదండ్రుల్నీ అంతే—

పదిహేనురోజులున్న తరువాత శంకరంగారు తానొక్కడే వెళ్లిపోయాడు డ్యూటీకి.

రవి కాలేజీకి వెళ్ళివస్తూండేవాడు జీవచ్ఛవంలా—

అవాళ షాప్‌లో జరిగిన సంఘటన ఎల్లా తెలిసిందో కాలేజీలో తెలిసిపోయింది—ఇతన్నిచూసి జాలిపడేవారు కొందరూ, అదివరకు యీర్ష్యతోఉండి యిప్పుడు సంతోషించేవారుకొందరూ-కాని అందరూ సానుభూతి ప్రకటించేవారు—అది భరించలేకపోయాడు రవి—

ఎవరికితోచిన సలహాలు వారు యిచ్చేవారు— వినేవాడు చెప్పేవాడికి లోకువ సామెతగా—

శారద తన్ను గుర్తించినప్పుడల్లా చీదరించుకునేది—అది అతనిగుండెలని మండించేది—అంతగా ప్రేమించిన తననే ఆమె కసురుకుంటే అతనికి కోపం. ఏమీ చెయ్యలేకపోయిన అసహాయత కృంగదీసి నిస్పృహ ఎక్కువైపోయింది—నిద్రాహారాలే ఉండేవికావు—ప్రపంచమే శూన్యమైనట్టుండేవాడు—

ఒక్కొక్కప్పుడు తన జీవితం కష్టపడడానికి నోచుకుందేమోననిపించేది—శారద యిల్లా బతికేకంటె చచ్చిపోతే యీ సస్పెన్స్ వదిలిపోతుందేమోననిపించి అల్లా జరిగితేగబాగుండుననుకునేవాడు—

అంతలోనే అటువంటి అమానుషమైన పైశాచికమైన, నీచపుటూహ వచ్చినందుకు తన్ను తానే నిందించుకునేవాడు—ఏం తప్పు చేసిందని ఆమెననుకోవడం—తన చేజేతులా తనే తెచ్చుకున్నదిది— ఆమె ఏమైనా కావాలని తెచ్చుకుందా—ఆమె సాన్నిహిత్యంలో తాను పొందిన ఆనందం—ఆ మధురక్షణాలు—అవి చాలవూ యీ జీవితానికి—

భరించలేని ఆవేదన కలిగినప్పుడు తనే చచ్చిపోదామనిపించేది—కాని చచ్చి ఏమిటి సాధించడం— తన కథలలో ఆత్మహత్య అవివేకమనీ, అది పిరికివారు చెయ్యవలసిందనీ ఉద్బోధించ ప్రయత్నిస్తాడే—తనేనా అది చెయ్యడం—

తనికి విషాదాంతపు కథలు రాయడం ఎక్కువ ఇష్టం. అవి చదివేవారి నెక్కువ కదిలిస్తాయని తన నమ్మకం—కాని జీవితంలో నిజంగా విషాదాన్నెదుర్కోవడం ఎంత కష్టం—

కష్టపడి ఆశ పెంచుకునేవాడు—శారద మామూలుగా తయారై పోతుంది—తమ జీవితంలోని గడిచిన మధురానుభూతుల్ని మళ్లీ నెమరువేసుకోవచ్చు—

నాలుగునెలలు గడిచినా ఎల్లోపతీ ప్రభావం కనబడక పోయేటప్పటికి ఏం చెయ్యాలో తోచలేదు రవికి—

ఎవరో సలహా యిచ్చారు—ఇటువంటి జబ్బులకి ఎల్లోపతీకంటే ఆయుర్వేదమే మంచిదని—

రెండు నెలలు సెలవుపెట్టి శారదనూ, అత్తగారినీ వెంట పెట్టుకుని ప్రసిద్ధిచెందిన ఆయుర్వేద ఉన్మాద వైద్యాలయానికి తీసుకువెళ్లాడు.

అదొక కుగ్రామం—

అపూళ్లో పరాయివాళ్లంతా యిలా వైద్యానికి వచ్చినవారే—

పెద్ద ఆసుపత్రి. రోగులకి మనిషికి ఒక గదీ—

స్తోమతుఉన్నవారు వేరే యిళ్లు తీసుకొని రోగులని తమతో ఉంచుకునేవారు — ప్రమాదంకరంకాని వ్యక్తులనైతే బంధువులు వేరే యిల్లు తీసుకుని ఉండి రోగిని ఆసుపత్రిలో ఉంచేవారు కాపలాకి ఒక నౌకరుతో సహా—

ఆసుపత్రిలోఉండేరోగులు వంటరివారైతే హొటల్‌నించి భోజనపు ఏర్పాట్లుండేవి—

శారదకి ఉద్ధృతమైన వ్యాధి కాకపోవడంతో ఇంట్లోనే ఉంచాడు రవి—

రోజూ ఆసుపత్రికి తీసుకువెళ్ళడం—

అక్కడ కషాయాలు తాగించడం—లేహ్యాలు తినిపించడం నిమ్మకాయరసం పట్టించి తలారా స్నానం చేయించడం—

వారానికోసారి నస్యం—

అంటే ముక్కులో ఏదో పొడుంవేసి నాలుగైదు చుక్కల నిమ్మకాయరసంపిండి బలవంతంగా వాళ్లచేత ఎగపీల్పించడం—అది రోగులకి మహా యాతన—ఎవ్వరూ ఆ ప్రక్రియకి ఒక పట్టాన అంగీకరించేవారుకాదు—తీవ్రతరమైన రోగుల విషయంలో నానా బీభత్సం జరిగేది—దానిని వారించడంకోసం ఇద్దరు ముగ్గురు వ్యక్తులు వారిని బలవంతంగా పట్టుకునేవారు—అప్పటికీ లొంగకపోతే తాడించేవారు—

రవికి అవన్నీ చూస్తుంటే కళ్ళ నీళ్లు తిరిగేవి—

తనెంతో పదిలంగా చూసుకునే శారద కీపాట్లన్నీచూసి ఏడ్చేవాడు—

కాని అక్కడ ఒక్క రిలీఫ్ ఉంది—

పిచ్చివాళ్లకు అలవాటుపడిన యీ వాతావరణంలో పిచ్చివార్ని వింతగా చూడడంగాని, గేలి చేయడంగాని జరిగేదికాదు—

పట్నంలో తమ యింటికి ఎవరేనావస్తే తన భార్యకు పిచ్చి అనితెలిస్తే ఎంతో అవమానంగా ఉంటుందనేభావానికి స్వస్తిజరిగిందిక్కడ—ఇంత మందిని చూడడంతో—

అనుభవంలోకి వచ్చింతరువాత కష్టాలు భరించడం అంత కష్టంకాదు—అనుభవంలేనివారు తమకు సంప్రాప్తించిన చిన్న కష్టాన్నే గోరంతలు కొండంతలు చేసుకుని ప్రపంచంలోకల్లా తమ కొక్కరికే కష్టాలున్నాయనుకుంటారు—దానివల్ల వారి బాధ ద్విగుణీకృతమవుతుంది—

కాని యితరుల కష్టాలు, చరిత్రలు విన్నప్పుడు మనం యీమాత్రంగానైనా ఉన్నాం అని పూరట కలుగుతుంది—

అక్కడ యింకా యితర రోగులని గురించీ, వారి ఉన్మాదానికి కారణాలను గురించీ విన్నాడు రవి—

ఒక ఆయన ఎగ్జిక్యూటివ్ యింజనీరు—సుఫురద్రూపి, వయస్సు నలభై లోపు—రంభలాటి భార్య—ముద్దొచ్చే యిద్దరు కొడుకులూ—ఒకడికి పదీ, మరోడికి ఎనిమిదీ—

చిన్నప్పుడే తండ్రిపోతే కష్టపడి పైకొచ్చి తమ్ముణ్ణి ఎంతో చదివించి ప్రాజ్ఞుణ్ణి చేశాడు. మంచి సంబంధంచూసి పెళ్ళి చేద్దామనుకుంటుంటే—ఒకరోజున హఠాత్తుగావచ్చి తాను వర్ణాంతర వివాహం చేసుకోదల్చుకున్నట్టు చెప్పాడు—అది యీాయనకి నచ్చలేదు—నయానా భయానా వారింపజూశాడు. వినకపోతే ఆఖరికి అతని విషయంలో తాను పడిన శ్రమా, ఆవేదనా అన్నీ గుర్తుకుతెచ్చి అతని కృతఘ్నతని ఎత్తిచూపాడు—అంతే అతను ఆత్మహత్య చేసుకున్నాడు— ఆతను ప్రేమించినామె—ఆమె ఎంత గాఢమైన ప్రేమో—ఇతని మృతిఫలితంగా విరాగిణిఅయిపోయింది ఉద్యోగం వదిలేసి—

ఈ సంఘటనలతో ఆ యింజనీరుగారి పశ్చాత్తాపానికంతులేకపోయింది — ముద్దుగాపెంచి పెద్దచేసి కష్టపడి వృద్ధిలోకి తెచ్చిన తమ్ముణ్ణి చేజేతులా చంపేసినట్టు ఫీలయి పిచ్చెక్కిపోయాడు—

మరోకేసు మరీ విచిత్రమైనది—ఆయనో పెద్ద మోతుబరిరైతు—కష్టపడి వ్యవసాయం చేస్తాడు—తెలివిగా వ్యవహరించి ఆస్తిని యినుమడింపజేశాడు. ఇంటి వ్యవహారాలపట్ల శ్రద్ధ— వూరి వ్యవహారాల్లో తీర్పులు చెప్పడం అన్నీ ఉన్నాయి—కాని వేసవికాలం తప్పనిసరిగా పిచ్చెత్తుతుంది—ఆ రెండునెల్లు యిక్కడికివచ్చి వైద్యం చేయించుకుంటాడు—తగ్గిపోతుంది—ధనవంతులు వేసవిలో వూటీవెళ్ళినట్టే యీ వూరొచ్చేస్తాడీయన—ఆ తత్వానికి ఎండాకాలం పడదు—

వింత వింత రోగులు—ఆడా, మగా, పిల్లలు అంతాను—

అంతమందీ ఆశతో వ్యాధి నివారణకు ప్రయత్నించడం రోజూ తగ్గిపోయినవాళ్ళు వికసితవదనాలతో ఆచార్యులవారికి వందనాలర్పిస్తూ, క్షేమంగా తిరిగివెళ్ళడం చూస్తూంటే రవికి ఆశ జనించేది—

శారద మామూలు మనిషై పోతుంది—మళ్ళీ మోడువారిన తన జీవితం చిగురుస్తుంది—అనుకునేవాడు—అతని మనస్సు పంచకల్యాణే అయిపోయేది అప్పుడు—

అంతలోనే నెలలతరబడి తగ్గకుండాఉన్న రోగుల్నిచూస్తూంటే శారదకింక తగ్గదేమోననిపించి ప్రాణం చివుక్కుమనేది—

ఇటువంటి ఆశ నిరాశలమధ్య వూగులాడుతుండేది రవి మనస్సు—

శారద ఒక్కొక్కప్పుడు ఉత్సాహంకనబరిచేది అలంకరించుకునేది—

అతని కారోజు స్వర్గం కనిపించేది ఆమె సాన్నిహిత్యంలో–

మరో రోజున మాసినచీరా—రేగినజుట్టూ—

కొన్నాళ్ళకి శారదలో మార్పు కనిపించింది—

మెల్లి మెల్లిగా పరిసరాలని పట్టించుకోనారంభించింది.

ఒకరోజున రవితో—"మనమిక్కడెందుకున్నాం?" అనడిగింది—

ఏం చెప్పాలో తెలియని రవి "నాకు కొంచెం సుస్తీచేసి వైద్యానికొచ్చాం—" అన్నాడు.

"అబ్బా ఎంత చిక్కిపోయారో—కళ్ళు లోతుకుపోయాయి నల్లబడిపోయారు." వాపోయింది.

"తగ్గిపోయింది శారదా—"

"మనం ఎప్పుడొచ్చాం చెప్మా?—" ప్రశ్నించింది.

"వారం అవుతుంది."

"నాకేం జ్ఞాపకం లేదేం?"

"ఇందులో జ్ఞాపకం ఉండడానికేముంది శారదా—" అన్నాడు ఏదో అనాలి గనక—

"కాదు—ఏదో లీలగా జ్ఞాపకం వస్తోంది—నాకే వంట్లో బాగుండక వచ్చినట్టున్నాం—"

ఆమెలోని ఈ మార్పుకి రవి హృదయం పరవళ్లు తొక్కింది.

పార్వతమ్మగారి ఆనందానికి అవధులు లేవు.

మూడో రోజున

"యింకెన్నాళ్ళు బాబూ యీ వెధవ వూళ్ళో, పోదాం పదండి." అందరికి కాఫీ యిస్తూ—

"ఇంకొక్క వారం ఆగు—"

"మీకెల్లా తోస్తోంది మహాత్మా ఈ వూళ్ళో—"

"నువ్వుంటే ఇంక తోచకపోవడం అనేది నాకుండదు శారదా—

శారదకు పూర్తిగా నయమైపోయింది. తనూ శారదా తమ వూరెళ్లిపోయారు—జీవితం మూడు పువ్వులు ఆరు కాయలు అనిపించింది.

అవాళ రవికి పేపరు దిద్దిన బాపతు అయిదు వందలు వచ్చాయి—

జ్యూయెలరీషాప్‌కివెళ్లి అయిదువందలిచ్చి మిగతా మూడు వందలకీ పద్దు రాయించి లేటెస్ట్ మోడల్ నెక్‌లెస్ ఒకటి కొన్నాడు—

చిరునవ్వుతో ఎదురు చూస్తోంది శారద—

అతని ముఖంలోని పట్టలేని ఆనందం చూస్తూ.

"ఎందుకబ్బా అంత సంతోషం? అడిగింది. అతని ముఖం కూడా అనిర్వచనీయమైన సంతోషంతో వెలిగిపోతోంది–

"చెప్పుకోచూద్దాం—"

"చెప్పెయ్యనా—" పూరించింది.

కొంపతీసి తెలుసా ఏమిటి? అనుమానం వేసిందతనికి—

"చెప్పు తెలిస్తే—" రవంత ఉత్సాహం తగ్గిందతనిలో—

"మీకథ పడినట్టుంది—"

"అయ్యోవెర్రిపిల్లా—"అన్నాడతను మళ్లీ పుంజుకుని—

"పోన్లెండి—యిష్టంఉంటే చెప్పండి లేకపోతేలేదు—" చిరుకోపంతో అంది—

"అయితే కళ్ళు మూసుకో—"

అలిచిప్పలలాంటి ఆమె కళ్ళు అర్ధనిమీలితంగా మాత్రమే మూసుకున్నాయి—

"అదుగో చూస్తున్నావ్?"

"సరే యిదిగో మూసుకుంటున్నాను సరా—"

త్వర త్వరగా పొట్లంవిప్పి ఆ నెక్లెస్ ఆమె మెడ నలంకరించాడు.

ఆస్పర్శకు సగంలోనే కళ్ళు తెరిచి "అబ్బ ఎంత బావుందో? ఎంతా?"

"ఎంతైతే నీకెందుకు?—బాగుందిగా—"

"ఎంత మంచివారండీ—" కృతజ్ఞతతో మెరుస్తున్నాయామె కళ్ళు—

"మరి నాకు ప్రతిఫలం?"

"ఇంకో ఆర్నెలల్లో—"చిలిపిగానవ్వి అంతలోనే సిగ్గుల దొంతరే అయిపోయి—కళ్ళు మూసుకుంది పరవశత్వంతో—

"నిజంగా—"లక్ష నక్షత్రాల కాంతి కళ్లల్లో స్ఫురించగా ఆమెను తన బాహువుల్లో యిముడ్చుకుని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు—

నల్లికుట్టి హఠాత్తుగా మెలుకువ వచ్చిందతనికి—

కల కరిగిపోయినా అనుభూతి వదలలేదు—శారదకోసం వెతుకుతున్నాయి కళ్ళు—

ఆ గదిలోనే మరో మంచంమీద—

చింపిపోగులు పెట్టబడిఉన్న చీరమీద, అర్ధనగ్నంగా పడుకుని వుంది శారద!—

ఆశా శిఖరంమీదనించి అగాధంలో పడ్డాడు రవి.